# రాజీ

"నీ పేరే రాజీ! నీవు జీవితంతో రాజీ పడక చేసేది మాత్రం ఏముంది?"

రాజశేఖరం మాటల్లో అహంకారంవుంది. నేను పురుషుడ్ని; సర్వస్వతంతుడ్ని; నా యిష్టం వచ్చినట్లు ప్రవర్తించే అధికారం వుంది అన్న దర్పం వుంది. నీవు నోరుమూసుకొని పడివుండు అన్న ఆదేశం వుంది.

రాజ్యలక్ష్మి కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. కాదు తను యింతటి అవమానం సహించలేదు. భార్యాభర్తలు బండికి రెండు చక్రాల లాంటివారు. ఏ ఒక్కరూ అధికులు కారు. నిజమే! అతను లేకపోతే తన బ్రతుకుతెరువు జటిలమౌతుంది. అలాగని తన భర్త సూచించిన రాజీ ప్రశ్నను ఎలా సమాధాన పరచుకోగలదు? అతను చెప్పినట్లు ఆత్మను చంపుకొని బ్రతకగలదా? ఇదా తనకు సంస్కృతి నేర్పిన పాఠం??

పురాతన యుగంలో పతివ్రతలనిపించుకున్న స్త్రీలు యిలా ప్రవర్తించి వుండివచ్చు. నేడు కాలం మారింది. యుగధర్మంలో ఎన్నో మార్పులు వచ్చాయి. స్త్రీ కేవలం బానిసగా బ్రతకలేదు. ఆమెకు మనస్సువుంది. ఆశయాలు వున్నాయి, కోరికలు వున్నాయి. ఒక ఆలోచనా సరళి వుంది. తన బ్రతుకుని నిర్ణయించుకునే స్వాతంత్ర్యం వుంది.

"మీ వుద్దేశం ఇంత స్పష్టంగా చెప్తున్నప్పుడు నేను ఎంత చెప్పినా అది చెవిటివాడి ముందు శంఖం వూదినట్టే. చదువుకున్న వారు, వివేకవంతులూ మీరే యిలా ప్రవర్తించితే అబలనైన నేను చేసేది ఏముంది?"

"అందుకే నేచెప్పినట్లు నడచుకో. నీకే కష్టం వుండదు."

"అసంభవం. ఆత్మవంచన చేసుకొని మీ యింటిలో పడివుండలేను. మన దారులు వేరయ్యాయి; ధ్యేయాలు వేరయ్యాయి. పేరు రాజీ అయినా మీరనుకున్నట్లు జీవితంలో రాజీ పడలేను."

"రాజీ!"

"నా పేరు రాజ్యలక్ష్మి"

భార్య మొండిధైర్యం భర్తకు ఆశ్చర్యం కలిగించింది. ఏం చూసుకొని ఆమెలో యింత తెగింపు?

ఈలోగా రాజ్యలక్ష్మి తనవి, తనకుమార్తె అపర్ణవి బట్టలు ఎటాచీలో సర్దింది. కుమార్తెను తీసుకొని "వస్తాను" అనిచెప్పి బయటపడింది.

"రాజీ!" అన్నాడు ఆమె వెనుతిరిగి చూసింది.

"తొందరపాటు నిర్ణయం మంచిదికాదు. నాలో కొన్ని బలహీనతలు వున్నమాట వాస్తవం. అంతమాత్రానికే యింతటి నిర్ణయమా? బయట ప్రపంచంలో మగవాడి అండలేకుండా బ్రతకగలవా? నీతోపాటు అపర్ణ కూడా ఎందుకు? ముక్కుపచ్చలారని దాని జీవితం నాశనం చేస్తావా? నీకు వుండడం యిష్టంలేకపోతే కనీసం అపర్ణనైనా నాదగ్గర వదిలేయి."

"ఎందుకు? ఏనాడైతే మీరు చంచల మోహజాలంలో చిక్కుకున్నారో ఆ నాడే అది తండ్రిప్రేమకు దూరమైంది. మాతృప్రేమకూ దూరం చేయాలని చూస్తున్నారా? సవతితల్లి పెంపకంలో దానిజీవితం నాశనమవడం నేను సహించలేను. అది నాతోనే వుంటుంది" అంది.

"రాజీ! ఎంతైనా నీవు నా భార్యవు. అష్టకష్టాలు పడుతూవుంటే నేను సహించలేను. చివరిసారిగా అడుగుతున్నాను. నాతోపాటు వుండిపో."

"మొసలికన్నీటితో పనిలేదు. మీరు మీ నిర్ణయం తెలియజేసారు. నేను నా అభిప్రాయం చెప్పాను. ఈ అభ్యర్థనలు ఈ వేడికోలులూ మన జీవితాలను కలుపలేవు."

వెళ్ళిపోతున్న ఆమె వంక చూస్తూవుండిపోయాడు రాజశేఖరం. ఆ విధంగా ఆ భార్యా భర్తలు విడిపోయారు.

◆ ◆ ◆

రాజు జీవితం తెలుగు సినిమాకథలా పరిణమించడం నాకు బాధకలిగింది. ఆమె కథనే రాయవలసి వస్తుందని నేను కలలోనైనా వూహించలేదు. రాజు నా ఆప్తమిత్రురాలు, కలసి బి.ఏ. వరకు చదువుకున్నాము. వివాహ విషయంలో ఆమె తల్లిదండ్రులను ధిక్కరించింది. తాను ప్రేమించిన రాజశేఖరంతో పెళ్ళి చేసుకుంది. ఇది ఆదర్శవంతమైన వివాహం అని మేమందరం ఆనాడు శ్లాఘించాము. ఈ ఆదర్శం కారణంగా ఆమె శాశ్వతంగా పుట్టినింటికి దూరమైంది.

'నీవు మామాట కాదని నీయిష్టం వచ్చిన వాడిని పెళ్ళిచేసుకున్నట్లయితే; భంగపడి ఈ యింటిగుమ్మం ఎక్కాలనుకోకు, నీకోసం ఈ యింటితలుపులు శాశ్వతంగా మూసుకుపోయాయి" అని ఆమె తండ్రి నిక్కచ్చిగా పలికేడు.

'నాన్నా! మీరు ఎంతకాదనుకున్నా తండ్రీ బిడ్డల మన అనుబంధం తెగిపోదు. ఒకవేళ నా నిర్ణయంలో మోసపోయినపక్షంలో మీ గుమ్మంలో కాలుపెట్టను' అంది.

రాజశేఖరం ఒక సుస్థిరమైన వుద్యోగ్యం చేస్తున్నాడు. తన భార్యను, కలగబోయే సంతానాన్ని పోషించుకోగలిగిన సామర్థ్యం కలవాడు, అందుకే ఈ ఆదర్శవివాహానికి మా అందరి ప్రేరణావుంది.

కాలంతోపాటు మనుషులూమారాలి. ఒకనాడు రీతి రివాజుగా భావిస్తున్న ఎన్నో విషయాలు ఈనాడు సమాజవ్యవస్థలో మార్పులవలన. సైన్సు పరిజ్ఞానం వలన మూఢనమ్మకాలుగా మిగిలేయి. ఇద్దరి మనసులు కలసిన తరువాత ఆంక్షలు విధించి వేరుచేయాలనుకోవడం హర్షించదగినదికాదు. ఇప్పుడు నాకు బాధకలిగింది. ఈ ఆంక్షల వెనుక ఎంతటి ముందుచూపు వుంది! రాజు పరిస్థితి ఇప్పుడు రెండింటికి చెడిన రేవడి చందాన అయింది. గతజలసేతుబంధనం.

వారిద్దరు వేరయ్యారన్న వార్త నాకు చాలా ఆలస్యంగా తెలిసింది. ఈ వార్త నాకు పిడుగుపాటులా అనిపించింది. నమ్మశక్యం కానిదిగా తోచింది. హుటాహుటిగా బయలుదేరి విశాఖపట్టణం వచ్చాను.

"రా వకుళా! ఎప్పుడు రావడం? అంతా కులాసానా?" అంది ఆప్యాయంగా. తమ కొత్తజీవితంలో ఏయిబ్బందులూ పడడంలేదని నన్ను మభ్యపెట్టాలని లేని నవ్వు తెచ్చుకుంది. ఇల్లు బోసిపోయివుంది. బేంకు ఆఫీసరు ఇల్లులా లేదు. కుట్టుమిషనుమీద జాకెట్టు కుడుతున్నది.

"రాజు! అసలు విషయం ఏమిటి? మీ ఇద్దరిమధ్యా విభేదాలు రావడానికి కారణం ఏమిటి?"

"ఒక్క నిముషం ఆగు" అంది. ఆమె జాకెట్టు పూర్తిచేయడంలో నిమగ్నమైంది. మిషను టకటక శబ్దంతో మనస్సులో ప్రశ్నల రణగొణధ్వని.

ఆమె జాకెట్టు పూర్తిచేయడం, ఎవరో రావడం ఒకేమారు జరిగాయి. జాకెట్టు ఆమెకందించి ఆమె ఇచ్చిన రెండు రూపాయలు పుచ్చుకొంది.

"రాజు! చివరకు నీ బ్రతుకిలాగైందా?" నాకు ఏడుపే వచ్చింది. రాజు ఎలా పెరిగింది? తండ్రి వేలమీద జీతం తెచ్చుకునే ఆఫీసరు. భర్త సంపాదన అందుకు తీసిపోనిది. కడుపుకోసం ఆమె దర్జీపని చేస్తున్నది. ఓడలు బండ్లూ-బండ్లు ఓడలూ అంటే ఇదేనేమో!?

"ఏం చెప్పను వకుళా, నాజీవితం కథై పోయింది"

నేను మౌనంగా కూర్చున్నాను.

◆ ◆ ◆

"ఇరవై ఎనిమిది సంవత్సరాల వయసొచ్చిన అతను దక్షిణనాయకుడయ్యాడు. చంచల ప్రేమలోపడి నాపాట్లు నన్ను పడమన్నాడు. వకుళా! మా నాన్నమాట పెడచెవిన పెట్టినందుకు నాకు తగినశాస్తే జరిగింది.

మగవాడు బయటప్రపంచంలో తిరిగేవాడు. స్త్రీలతో కలివిడిగా తిరుగుతున్నాడని తెలిసినా మొదట్లో ఉపేక్షించాను. అదే నాకొంప ముంచుతుందనుకోలేదు. చంచల అతనిక్రింద పనిచేస్తున్న స్టెనోగ్రాఫరు. ఆఫీసులో ఒకరితో ఒకరు కలిసి వుండవలసిందేగా? ఒకటి రెండు పర్యాయాలు

ఇంటికీ వచ్చింది. పెళ్ళయినవాడిని వలలో వేసుకుంటుందని ఎలా వూహించను? ఆమెతో కలిసిమెలసి తిరుగుతున్నా అతను నన్ను ఏనాడు ఉపేక్షించలేదు"

" మరి ఎందుకు విడిపోవలసి వచ్చింది?" అన్నాను. "నీవు తొందర పడ్డావేమో?"

"తొందరపడకు. చంచల విసరిన వలలో అతను పూర్తిగా చిక్కుకున్నాడు. భార్యాబిడ్డలం వున్నాం అనికూడా ఆలోచించకుండా అతను వారంరోజులు ఆమెతోపాటు హనీమూన్‌కి వెళ్ళివచ్చారు. వారంవారం ఆఫీసుపనిమీద టూరు వెళ్తున్నానని చెప్పి రెండేసి రోజులు బయట గడిపేవారు. మరోస్త్రీతో భర్తను పంచుకునే స్థితికి నేను రాలేదు."

"ఆశ్చర్యంగావుంది. రాజశేఖరం ఇంతటి తెగింపుచేసి వుంటాడంటే నమ్మశక్యం కావటంలేదు" అన్నాను.

"వకుళా! ఈ సంగతి నాకూ ఆశ్చర్యమే కలిగించింది. అసలు ఈ విషయం నాకు తెలియకుండావుంటే బాగుండేదేమో?" అంది.

ఇంతలో అపర్ణ స్కూలునుంచి వచ్చింది. కాళ్ళు చేతులు కడుక్కొని వచ్చేసరికి రాజు దానికి మధ్యాహ్నం వండిన అన్నం మజ్జిగకలిపి వడ్డించింది. అది బుద్ధిమంతురాలిలా తింటూవుంటే, నా దగ్గర కొచ్చింది.

"ఏమిటో అపర్ణ పసిజీవితంలో కష్టాలు రాసి పెట్టివున్నాయి" అనుకుంది స్వగతంగా.

తిరిగి అసంపూర్తి కథను చెప్పసాగింది.

◆ ◆ ◆

"రాజ్యలక్ష్మీ! ఏంచేస్తున్నావమ్మా?" అంటూ పొరుగింటి కాంతమ్మ పలకరించింది.

చేతిలో నవల పక్కనపెడుతూ 'ఏదో పుస్తకం చదువుతున్నాను' అన్నాను.

"అబ్బాయి వూరిలో వున్నట్లు లేదు" అంది.

"ఔనండీ ఆఫీసుపనిమీద కేంపువెళ్ళారు. రేపురావచ్చును."

"నాకు తెలియకడుగుతాను. బేంకు వుద్యోగులకు టూర్లు వుంటాయా?"

ఆమె అన్నది యదార్థమే. వారు ఈ గత ఎనిమిది సంవత్సరాలలోనూ ఏనాడోగాని టూరుమీద పోలేదు. మరి కొంతకాలంగా తరచు వెళ్తున్నారు. అయినా అతను అబద్ధం చెప్తారని అనిపించలేదు. అందుకే "బేంకు వుద్యోగులకు టూర్లు వుండవన్న నియమం లేదుకదండీ!" అన్నాను.

"నీ అమాయకత్వాన్ని ఆధారంగా చేసుకొని, అబ్బాయి నీకళ్ళుకప్పి నిన్ను మభ్యపరుస్తున్నాడు. అమ్మాయి, పెద్దదాన్ని ఇలా అన్నానని నన్ను అపార్థం చేసుకోకు."

"ఇంతకీ మీ వుద్దేశం ఏమిటండీ?" నాలో ఉత్కంఠ, ఉద్రిక్తత అధిక మయ్యాయి.

"అయినా నాకెందుకమ్మా! మీ ఆలూమగల స్వంతవిషయాలు. పొరపాటున నోరు జారేను. బహుశా అతను టూరుమీదే వెళ్ళివుండవచ్చు. నీ వన్నట్లు బేంకువాళ్ళకు టూర్లు వుండవన్న నియమం లేదుగా?"

ఆమె ఏదో చెప్పాలనే వచ్చింది. తాయిలం చేతిలో వుంచుకొని వూరించే మనస్తత్వం ఆమెది. మరో పరిస్థితిలో అయితే 'పోనీలెండి' అని వూరుకునే దానిని. ఇది నాజీవితానికి సంబంధించిన విషయం.

" ఇందులో అపార్థం చేసుకుందికి ఏముంది? మీరు ఏదో కల్పించి చెప్తున్నారని నేను అనుకోను, అసలు విషయం చెప్పండి" అన్నాను.

కాంతమ్మ పూసగుచ్చినట్లు రాజశేఖరం-చంచల ప్రణయ వృత్తాంతం చెప్పింది. రెండు మూడు నిదర్శనాలను కూడా ఇచ్చింది. కుందనం బొమ్మలాంటి భార్యను యింటిలో వుంచుకొని అతనికీ తిరుగుళ్ళేమిటి? ఇందతా నీ గ్రహచారం" అంది.

"పిన్నిగారు! మీరు అపోహపడుతున్నారు. వారి స్వభావం అలాంటిదికాదు" అన్నాను. జారిపోతున్న ధైర్యాన్ని కూడతీసుకొని.

"ఔనుమ్మా ఉన్నమాట చెపితే అలాగే వుంటుంది. నీవంటే నాకు పగా, ద్వేషమా? ఇప్పటికైనా మించిపోయింది లేదు. నీ సంసారాన్ని చక్కదిద్దుకో" అంటూ వెళ్ళిపోయింది.

◆ ◆ ◆

"వకుళా! అ మరునాడు అతను యింటికి వచ్చిన తరువాత విషయం కదిపాను. ముందు బుకాయించేరు. చివరకు నాయిష్టం. నేచెప్పినట్లు పడివుండు అన్నారు. ఈ అన్యాయాన్ని ఎలా సహించను?"

"భార్యగా నాకు లభించవలసిన ప్రేమను మీరు మరొకరికి పంచియిస్తుంటే ఎలా సమాధానపరచుకోను? మీరు భార్యాబిడ్డలను కాదని సీతాకోకచిలుకల వెనుక తిరగడం సమంజసమా? జరిగిందేదో జరిగిపోయింది. ఇంకనైనా మీ ప్రవర్తన మార్చుకోండి. గృహాన్ని నరకం చేయకండి" అన్నాను.

"అంటే నన్ను శాసిస్తున్నావా?"

"లేదు అర్థిస్తున్నాను"

"చంచలంటే నాకు అభిమానం వున్నమాట నిజమే! అలాగని నిన్ను చిన్నచూపు చూడడంలేదే?"

"బాగుంది. మీకు యిద్దరు రాణులు కావలసివచ్చారు. ఇది మీకు న్యాయంగా తోచినా నాకు హర్షించదగినదిగా తోచలేదు"

"నీ ఇష్టాయిష్టాలతో నాకు ప్రమేయంలేదు, నేను పురుషుణ్ణి. నీ చెప్పుచేతల్లో లేను" అన్నారు.

"రాజు! నీవు తొందర పడ్డావేమో? చంచల ఆకర్షణకు లోనైనా యిది ఎల్లకాలం వుండేదా? అతనికి మాత్రం తనబిడ్డ మీద అనురాగం తరుగుతుందా? కొంతకాలంపోతే మార్పు వచ్చివుండేది కాదా?" అన్నాను నేను.

"వకుళా! దేనితోనైనా రాజీపడగలను కాని సిద్ధాంతాలతో రాజీపడలేను. నైతిక విలువలు స్త్రీలకే కాదు పురుషులకూ ముఖ్యమే!"

"ముందు కర్తవ్యం ఏమిటి? ఇలా ఎంతకాలం కుట్టుమిషనుమీద ఆధారపడతావు?"

"నాకు ధ్యేయం ఒక్కటే! అపర్ణను పెంచి పెద్దచేయాలి. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాను. అంతవరకు ఈ మిషను సహాయం వుంది."

ఇంతలో పోష్టుమేను వచ్చాడు. "అమ్మా! మనియార్డరు వచ్చింది. తీసుకుంటారా తిప్పి పంపివేయమంటారా?" అన్నాడు. రాజు నిరాకరించింది. వాడు వెళ్ళిపోయాడు.

"ఇదీవరస, నేను స్వతంత్రంగా బ్రతకలేనని వారు ప్రతీనెలా డబ్బుపంపుతున్నారు. మా అవసరం వారికి లేనప్పుడు, వారి డబ్బు ఎలా తీసుకోను" అంది.

రాజు జీవితం తలచుకుంటే నాకు కడుపు తరుక్కుపోయింది, అక్కడవుంటే దానికి భారమే అవుతాను, మరునాడుదయాన్నే బయలుదేరాను. డబ్బుసహాయంచేయగలిగిన స్థితిలోవున్నా అది చిన్నబుచ్చుకుంటుందని ఆ ప్రయత్నం చేయలేదు. బయలుదేరుతూ అపర్ణచేతిలో ఆయిదు రూపాయ లుంచగలిగాను.

◆ ◆ ◆

కాలచక్రం గతిలో మార్పులేదు. రాజు దగ్గరనుంచి ఆడపాదడపా వుత్తరాలు వస్తున్నాయి. అది స్థానిక స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నది. నాకు రాజు జీవితం ఒక్క సినీమా కథలాగుంది. ఈ కథ విషాదాంతమా? లేక తెలుగు సినీమా కథలోని మధ్యాంతరమా? మధ్యాంతరమే అయితే దీని ముగింపు విధిగా సుఖాంతం అవుతుంది. అలాగవాలని మనసారా కోరుకున్నాను.

మనం కోరుకున్నవి కోరుకున్నట్లు జరిగితే అది జీవితమెట్లా ఔతుంది? కథకైతే మనకు నచ్చిన ముగింపు నిచ్చి రాసుకోగలం. ఇది యదార్థగాథ! అందుకే నాకు బాధ!?

◆ ◆ ◆

కాలం పరుగులో కేలండర్లు మారి పోతున్నాయి. నే కోరినది ఆశించినది జరగలేదు. వాళ్ళు విడిపోయి ఎనిమిది సంవత్సరాలైంది. అపర్ణ హైస్కూలు చదువు పూర్తి చేసింది. రాజు ఈ జీవితంలో స్థిరపడిపోయింది.

ఒక పత్రిక వాళ్ళు నాకథ కావాలంటూ రాసారు. కథ రాసే ప్రయత్నంలో ఆలోచిస్తున్న నాకు రాజు కథ రాయాలనిపించింది. ఏమని రాయను? ఈకథ వలన కలిగే సామాజిక లాభం ఏమిటి? ప్రేమ వివాహాలు ఫలించవనా? మగవాడి అండలేని స్త్రీ జీవితం మహా సముద్రంలో తెరచాపలేని నావ వంటిదనా? స్త్రీ తన బ్రతుకు తను నిర్ణయించుకోగలదనా? ఇందులో రాజు పాత్రకు ఎంతవరకు న్యాయం చేకూర్చగలను.

ఇంతలో పోస్టుమేను వచ్చాడు. రాజు దగ్గరనుంచి వుత్తరం. దానిపేరు తలుచుకోగానే వచ్చిన వుత్తరం.

"వకుళా! చాలారోజుల తరువాత రాస్తున్నాను. స్త్రీ తనకాళ్ళమీద నిలబడిబ్రతకాలనుకున్నా బ్రతకనీయదు లోకం. నా వుద్యోగం దొరకడానికి రామమోహన రావుగారు కారణం అని నీకు తెలుసుగా? అతను విధురుడు. భార్య ఆరేడేళ్ళ క్రితం మరణించింది. అడుగడుగునా నాకు అతను సహాయ సహకారాలు అందించుతూ వుంటే పాడులోకం ఈర్ష్య పడుతున్నది. మా మధ్య ఏదో అనైతిక సంబంధం వుందని ప్రచారం చేస్తున్నది. అతని అండ చూసుకొని నేను నాభర్తతో తెగతెంపులు చేసుకున్నానట. ఎవరెలా అనుకుంటున్నా నేను లెక్కచేయడంలేదు. చూశావా! పసిపిల్లలను కూడా ఈ గొడవల్లోకి ఈడ్చేరు. అమాయకులచేత గోడలమీద మా లీలలగురించి చాలా అసహ్యకరంగా రాయిస్తున్నారు. వకుళా! నీవు నమ్మగలవా నేను యింత నైచ్యానికి దిగగలనని."

ఎంతటి విషాన్ని మింగి బ్రతుకుతున్నాది నా రాజు! ఈ ఉత్తరంతో దుఃఖం వచ్చిన రాజు జీవితం సుఖాంతం కావాలంటే తగిన ముగింపు దొరికింది. ముగింపులో కొత్తదనం లేకపోవచ్చు. ఈ కథ ద్వారా నేనాశించేది ప్రైజు పారితోషికం కావు. అందుకే కథను పూర్తిచేయగలిగేను.

◆ ◆ ◆

నేను రాజుకి వుత్తరంరాసి పదిరోజులైంది. జవాబుకోసం వేయి కళ్ళతో నిరీక్షిస్తున్నాను. రాజు నా ప్రస్తావనను అంగీకరించి రామమోహనరావుని వివాహమాడగలదన్నదే నాభావం. అందులో నాకెలాంటి తప్పు కనుపించలేదు. ఆనాడు ఆశించిన ఉత్తరం వచ్చింది.

"వకుళా! స్నేహితురాలిపట్ల నీ అభిమానానికి కృతజ్ఞతలు, జీవితాలనూ నీవు కథ దృక్పథంతోనే చూస్తావన్నది మరోమారు ఋజువైంది. యదార్థ జీవితాలు కథల్లాగే ముగియా లనుకుంటావు, అది సాధ్యమా? ఇప్పుడు నాకు పెళ్ళా? పెళ్ళీడుకొచ్చిన అపర్ణ సంగతికాదా ఆలోచించవలసినది. లోకం ఏదో కూస్తున్నదని ఈనాడు అలాగే ప్రవర్తించితే వారి శంకలు యదార్థమని మనం అంగీకరించినట్లేగా? రామమోహనరావుగారిపట్ల నాకు మొదటినుంచి ఒక చెల్లికి అన్నపట్లగల ప్రేమ ఉంది. అతనూ నన్ను చెల్లెలిలాగే చూసుకుంటాడు. ఇక నీ కథ

విషయం. కథా సంవిధానం, భాష, శైలీ శిల్పం అన్నీ బాగున్నాయి. భావ వ్యక్తీకరణ స్పష్టంగావుంది. తప్పక పంపు. ప్రైజు రాగలదు."

ప్రైజు నాశించా నేను కథరాశాను? అందులోనూ రాజుకథ. అందుకే ఆకథను పోష్టుచేయలేకపోయాను.

అపర్ణ పెళ్ళికి వెళ్ళిన నాకు ఈ కథ పూర్తిచేసే అవకాశం అనుకోకుండా లభించింది.

◆ ◆ ◆

రాజ్యలక్ష్మి కుమార్తె పెళ్ళికార్డులు ప్రింటు చేయించింది. వారం రోజులేవున్నా ప్రింటైన కార్డులు పోష్టుచేయలేక పోయింది. ముందుగా కార్డు వారికి అందివ్వాలన్నది ఆమె తలంపు. ఆ రోజు సాయంత్రం స్కూలునుంచివస్తూ రాజశేఖరం యింటికి వెళ్ళింది. కాళ్ళు ముందుకి వెళ్ళడానికి ప్రతిఘటిస్తున్నా ధైర్యాన్ని కూడగట్టుకొని గేటు తీసింది. ఒకనాడు ఈ ఇంటికి యజమానురాలు. నేడు లోపలికిపోవడానికి ధైర్యంలేదు. రాజశేఖరం వీధివసారాలోనే ఉన్నాడు.

"రాజీ! రా" అన్నాడు అప్యాయంగా.

"నా పేరు రాజ్యలక్ష్మి! రాజీకాదు" చేతిలోవున్న ఇన్విటేషను కార్డులు, ఒక వుత్తరం భర్తకు ఇచ్చింది. ఉత్తరంలో 'కనినందుకు పెంచే బాధ్యత తీసుకోకపోయినా కనీసం కన్యాదానంచేసి తండ్రిగా మీకర్తవ్యం నిర్వహించండి, అనికోరింది.

"రాజీ! నా కూతురి పెండ్లిపిలుపు నాకే అందజేస్తున్నావా?" అన్నాడు. రాజ్యలక్ష్మి పెండ్లిపిలుపులు తండ్రి తరఫునే ప్రింటుచేయించింది. తను వచ్చినపని అయిపోగానే వెళ్ళిపోయింది.

పెళ్ళికివచ్చి కన్యాదానం చేస్తారా? చంచల యిష్టపడుతుందా? అన్నవి జవాబు దొరకని ప్రశ్నలుగానే నాకూ రాజుకూ మిగిలిపోయేయి. పెళ్ళి ముహూర్తం గంటలోకివచ్చింది. "నా వెళ్ళే వారు వస్తారనుకోవడం" అంది. అదిస్వగతమో, నన్ను వుద్దేశించో. అయితే ఆమె ముఖంమీద ఆనందరేఖలు వెల్లివిరియడానికి ఎంతోకాలం పట్టలేదు. ఆ భార్యాభర్తలు పీటలమీద కూర్చుని కుమార్తె వివాహం జరిపిస్తూ వుంటే నాకు రాజు పెళ్ళి గుర్తుకొచ్చింది. హేభగవాన్! వీరిద్దరిని ఒకటి చేయలేవా? అనుకున్నాను. రచనాసృష్టికి, సృష్టిరచనకు ఎంత భేదం! పెళ్ళి వైభవంగా జరిగింది. ఇన్నాళ్ళు మోడువారిన జీవితం గడిపిన రాజు తిరిగి మనిషిలా మారింది.

చుట్టాలందరూ వెళ్ళిపోతున్నారు. ఊరిలోనేవున్న బంధువుల యింటికి వెళ్ళి మధ్యాహ్నం భోజనం చేసివస్తాను అని చెప్పి వెళ్ళి పోయాను.

"రాజీ ! సారీ, రాజ్యలక్ష్మీ!"

రాజుగతుక్కుమన్నది. ఎదురుగా రాజశేఖరం. అతడు వెళ్ళిపోలేదా? ఇంకా వున్నాడా?

"ఈపూట నాకు భోజనం లేదా?"

"సారీ! మీరు కూడా వెళ్ళిపోయివుంటా రనుకున్నాను. వకుళ చుట్టాలింటికి వెళ్తూ భోజనానికి రానంది. నాకొక్కరి కోసం వంటదేనికి, రాత్రివి మిగిలేవున్నాయని వండలేదు. ఉండండి, అరగంటలో వడ్డించేస్తాను" అంది.

"ఇప్పుడేం వండుతావు. ఉన్నదే నాకూ వడ్డించు" అన్నాడు రాజు. అలాగే చేసింది.

"రాజీ... నీచేత్తో వడ్డించుతే తిని ఎన్నాళ్ళైంది?"

"సుమారు పది సంవత్సరాలు" అప్రయత్నంగానే జవాబిచ్చింది. అపర్ణ ఎనిమిదో ఏట మనం విడిపోయాం. దానికి యిప్పుడు పద్దెనిమిది."

"రాజీ! ఇలాగే నీచేతి వంట తినాలనిపిస్తున్నది. కొన్ని సంవత్సరాలుగా దీనికోసం తపించుకుపోతున్నాను. నీవు నమ్మగలవా?"

"నమ్మగలను"

"రాజీ! అయితే నాకోరిక తీరుస్తావా?"

"అసంభవం. మీ కోరిక సమంజమైనదికాదు. నా జీవితవృక్షం వసంతకాలంలోనే ఆకులు రాల్చేసింది. ఇప్పుడు పూర్తిగా ఎండిపోయింది. తిరిగి దానిని చిగురింపజేయాలని కోరుకోవడం సాధ్యం కానిది" అంది రాజు.

రాజీ! ఒక బలహీన క్షణంలో నేను తప్పటడుగు వేసాను. పొరపాటే! నేను ఒక రోజూ సంతోషంగా బ్రతకలేక పోయాను, ఈ మూడు రోజులూ నా జీవితంలో మరుపురానివి. నీవు బాగా నీరసించి పోయావు. అపర్ణకూడా దూరమైంది నీకు. నామాటవిను"

"చూడండి. మీరు చంచల మెడలో తాళి కట్టకపోయినా ఆమె మీ భార్యే! మీకు సంతానం కూడా వుంది. అపర్ణ తండ్రి ప్రేమకు నోచుకోలేదు. వారినీ తండ్రిప్రేమకు దూరం చేయకండి" అంది.

ఆ సంభాషణంతా బయటనుండి విన్న నాకు ఈమారు మరింత ఆశ్చర్యం వేసింది. రాజశేఖరం మొఖం వేలవేసుకొని వెళ్ళిపోయాడు నాప్రక్కనుంచే.

**- జాగృతి వార్తపత్రిక, ఉగాది ప్రత్యేక సంచిక 1979**